ఆటంకాలు సృష్టించినా రజతోత్సవ సభ సక్సెస్

సిదిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఏప్రిల్ 28: ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా బీఆర్ఎస్ రజతోత్సవ సభను కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు విజయవంతం చేశారని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరామ్, నాయకులు గుండు భూపేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపుతో బహిరంగ సభలో కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నారన్నారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు నిర్వహించి సభా ప్రాంగణానికి స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. బహిరంగ సభకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారన్నారు. 16 నెలల్లో ప్రజల ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గతంలో ఏనాడూ చూడలేదన్నారు.రాష్ట్రవ్యాప్తంగా సభకు తరలివచ్చిన కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారాలు మానుకొని హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో కౌన్సిలర్ సుందర్, నాయకులు మోహిజ్, జువ్వన్న కనకరాజు, ఇర్షాద్ హుస్సేన్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, భారీ బహిరంగ సభలు నిర్వహించడం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే సాధ్యమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.సోమవారం ఎమ్మెల్యే పల్లా స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ బీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించిన రజతోత్సవ సభ రికార్డు సాధించిందని, సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేశారని, లక్షలాది మంది ట్రాఫిక్‌జామ్,ఆర్టీవో అధికారులు అడ్డుకోవడంతో సభకు చేరుకోలేదన్నారు.సభను అడ్డుకునేందుకు ఎన్నికుయుక్తులు పన్నినా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఉన్న ప్రేమను చాటుకున్నట్లు తెలిపారు. రానున్న రోజులు బీఆర్ఎస్ పార్టీవేనని, రజతోత్సవ సభతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందన్నారు.

కొనుగోలులో నిర్లక్ష్యం వహించొద్దు

చెల్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక,ఏప్రిల్28:ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో 2,3వ వార్డుల్లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మెప్మా సిబ్బందికి సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున వేగవంతంగా రైతుల ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. కేంద్రా ల్లో రైతులకు తాగునీరు, టార్పాలిన్లు అందుబాటులో ఉండాలన్నా. దళారులు, రైస్‌మిల్లర్లను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. మెప్మా సీఈవో సరిత, ఆర్పీలు ఉన్నారు.

మాజీ ఎంపీపీ స్వామికి నివాళి

కోహెడ, ఏప్రిల్ 28: మండల మాజీ ఎంపీపీ ఉప్పుల స్వామి 4వ వర్ధంతిని సోమవారం బీఆర్ఎస్ నాయకుడు పిడిశెట్టి రాజు నిర్వహించారు. స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మణ్, గవ్వ వంశీధర్‌రెడ్డి, తిప్పారపు నాగరాజు, జాలిగాం శంకర్, పట్టిపల్లి పద్మారెడ్డి, పొలవేని కుమారస్వామి, వేల్పుల శంకర్, మల్లేశం, ముంజ సంపత్ పాల్గొన్నారు.

రామచంద్రం సేవలు మరువలేనివి

మాజీ జడ్పీటీసీ రామచంద్రం కుటుంబాన్ని పరామర్శిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రయ్య, బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 28: హుస్నాబాద్ మాజీ జడ్పీటీసీ కన్నోజు రామచంద్రం సేవలు మరువలేనివని మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య అన్నారు. మాజీ జడ్పీటీసీ, న్యాయవాది రామచంద్రం కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కన్నోజు రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు అయిలేని గాల్‌రెడ్డి, పాకల శ్యామ్‌సుందర్‌గౌడ్, మేకల వికాస్‌యాదవ్, అరవింద్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాతృవియోగం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్28: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి మాజీ సర్పంచ్ బర్మ రాజమల్లయ్య తల్లి బర్మ కొమురమ్మ మృతి చెందింది. సోమవారం రాజమల్లయ్యను పలువురు నాయకులు పరామర్శించారు. అనంతరం కొమురమ్మ అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ ధూళిమిట్ట, మద్దూరు మండల అధ్యక్షులు యాదగిరి, సంతోష్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ సుమలతామల్లేశం, మాజీ ఎంపీటీసీలు నందనబోయిన నర్సింహులు, గూళ్ల సత్యకళాఆనందం, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దాసరి పురుషోత్తం, పీఏసీఎస్ డైరెక్టర్ దేవదాస్ పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా,జైలు

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 28 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది.సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..పట్టణంలోని నర్సాపూర్ ,ఎంపీడీవో చౌరస్తాలతో పాటు రాజీవ్‌రహదారిపైన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు.మద్యం తాగి వాహనాలు నడుతున్న 14 మందిని పట్టుకున్నామని, వారిని న్యాయమూర్తి కాంతారావు ఎదుట హాజరుపర్చగా విచారణ జరిపి రూ.23,500 జరిమానా, ఒక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించారని వివరించారు. సిద్దిపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ఉపేందర్ ఆధ్వరంలో వాహనాల తనిఖీ జరిగాయి.ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మంది పట్టుబడ్డారు.వారికి న్యాయస్థానం రూ.11,500 జరిమానా, ఒకరికి 5 రోజుల జైలు శిక్ష విధించింది.

తోట సతీశ్‌కు సన్మానం

సిద్దిపేట ఏప్రిల్ 28 సిద్దిపేటకు చెందిన తోట సతీశ్ ఏషియన్ యోగాసన సన్మానం పొందారు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 25 నుంచి 27 వరకు రెండో ఏషియన్ యోగాసన పోటీల్లో తెలంగాణ రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యుడు, యోగా గురువు తోట సతీశ్ రాష్ట్రం నుంచి ఏషియన్ యోగాసన పోటీలకు జడ్జిగా ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి న్యూఢిల్లీలో జరిగిన ముగింపు ఉత్సవంలో కేంద్ర మంత్రి హర్షమల్హోత్రా , వరల్డ్ యోగాసన అధ్యక్షుడు డాక్టర్ జయదీప్‌ఆర్యా , యోగాసన భారత్ అధ్యక్షుడు ఉదిత్ సెత్ , ఏషియన్ యోగాసన అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ సతీశ్‌కు జ్ఞాపక అందజేసి సన్మానించారు. తోట సతీశ్ సన్మానం పొందడంపై రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్‌రావు, కృపాకర్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తొగుట,ఏప్రిల్ 28: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తొగుట ఎస్సై రవికాంతారావు తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన చిలువేరి నరేశ్‌గౌడ్(30) తల్లిదండ్రులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో తల్లిదండ్రులకు పక్షవాతం రాగా వ్యాధి నయంచేయడానికి అప్పు చేసి మందులు తీసుకువస్తున్నాడు. చేతిలో పనిలేక ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతోపాటు మద్యం, చెడుఅలవాట్లకు బానిసయ్యాడు. దీంతో మరిన్ని అప్పులు ఎక్కువయ్యాయి. మనస్తాపానికి గురై సోమవారం ఇంటిలోనే సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్లపై ధాన్యంతో ప్రమాదాలు

దుబ్బాక-గంభీర్‌పూర్ రహదారిపై ఆరబోసిన ధాన్యం

దుబ్బాక, ఏప్రిల్ 28: రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోయడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని దుబ్బాక-అప్పనపల్లి రహదారి, దుబ్బాక-గంభీర్‌పూర్ రహదారిలో రైతులు ధాన్యం ఆరబోశారు. దీంతో తరుచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టడమేకాకుండా రాత్రి సమయంలో ధాన్యం కుప్పలను అలాగే వదిలి వెళ్తున్నారు. పలు చోట్ల ధాన్యం కుప్పల పక్కన పెద్దపెద్ద రాళ్లు ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా మారాయి. ఉదయం రోడ్లపై ధాన్యం ఆరబోయడంతోపాటు నూర్పిళ్లు చేయడం వల్ల రోడ్లగుండా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా ధాన్యం రాశులు పోయడంతో పాటు వాటి పక్కన బండరాళ్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో దుబ్బాక-హబ్షీపూర్ రోడ్లపై ధాన్యం కుప్పలు ఏర్పాటు చేయడం వల్ల రాత్రి సమయంలో వాటిపై నుంచి వాహనాలు నడిపి పలువురు ద్విచక్ర వాహనదారులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. మూడేండ్ల కిందట అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి వద్ద ధాన్యం కుప్పను ఢీకొని ఓ వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవల దుబ్బాక మండలం గంభీర్‌పూర్ -శిలాజీనగర్ రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న ధాన్యం కుప్పను ఢీకొని ఆటో ప్రమాదానికి గురై అందులోని ప్రయాణికులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయంపై దుబ్బాక ఎస్సై గంగారాజును వివరణ కోరగా...రోడ్లపైన వరి ధాన్యం ఆరబెట్టవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వారికి ముందస్తు సూచనలు చేయడం జరిగిందన్నారు. రోడ్లపై ధాన్యం పోయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

దుబ్బాక-పెద్దగుండవెల్లి రోడ్డుపైనే హార్వేస్టర్ ద్వారా ట్రాక్టర్‌లోకి ధాన్యం పోస్తున్న దృశ్యం

భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

గజ్వేల్, ఏప్రిల్ 28: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ మను చౌదరి తెలిపారు. సోమవారం గజ్వేల్ ఐవోసీ సమావేశ మందిరంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను అదనపు కలెక్టర్ రైతులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతితో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డులాగా భూమికి భూధార్ సంఖ్య కేటాయింపు ప్రణాళికను తీసుకొస్తుందన్నారు. దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చన్నారు. గ్రామాల్లోని ప్రజలకు భూ భారతి చట్టంపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించే ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో) నిర్ణయం, కలెక్టర్ నిర్ణయంపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, మండల ప్రత్యేకాధికారి సువర్ణ, తహసీల్దార్ శ్రవణ్, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

మెప్మాలో అవినీతిపై ఫిర్యాదు

గజ్వేల్ మెప్మాలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళా సంఘాల గ్రూపు సభ్యులు సోమవారం కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ పరిధిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు తెలియకుండా డబ్బులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు డబ్బులను రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలపై మెప్మా, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. లక్షలాది రూపాయలను డ్రా చేసుకొని సంఘం సభ్యులను మోసం చేసిన ఆర్పీ కృష్ణలీల, మహిళ సంఘం అధ్యక్షురాలు మంజులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు కొమురవెల్లిలో భూభారతిపై అవగాహన

కొమురవెల్లి, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్‌లో మంగళవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కొమురవెల్లి తహసీల్దార్ దివ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు కలెక్టర్ మనుచౌదరి,అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు అవగాహన సదస్సుకు హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు మర్కూక్‌లో ...

మర్కూక్,ఏప్రిల్ 28: మర్కూక్ రైతు వేదికలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆయా గ్రామాల రైతులకు భూభారతి చట్టం పై అవగాహన కల్పించనున్నట్లు మర్కూక్ తహసీల్దార్ ప్రవీన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్,అదనపు కలెక్టర్, ఆర్డీవో హాజరుకానున్నట్లు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన

చేర్యాల: పోతిరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న షీటీమ్స్ బృందం సభ్యులు

చేర్యాల, ఏప్రిల్ 28 : మండలంలోని పోతిరెడ్డిపల్లిలో సోమవారం హుస్నాబాద్ పోలీస్ షీటీమ్స్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, షీటీమ్ నిర్వహిస్తున్న విధులు, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందవచ్చు అనే అంశాలతో పాటు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్ మాటలు నమ్మడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అవహేళనగా మాట్లాడినా వెంటనే షీటీమ్ సెల్: 8712667434 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.కార్యక్రమంలో షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళా పీసీలు స్వప్న, ప్రశాంతి, కృష్ణ పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

గజ్వేల్, ఏప్రిల్ 28: మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏఎస్సై శ్రీరాములు అన్నారు. సోమవారం గజ్వేల్ సమీకృత మార్కెట్‌లో మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతలకు ఎప్పుడు అందుబాటులో ఉంటామని, ఎలాంటి ఘటన జరిగినా పోలీసులను ఆశ్రయించాలన్నారు. గ్రామాల్లో సంచరించే అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత గ్రామాల్లో మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, అలాంటి వారిపై నిఘా పెట్టాలన్నారు.కానిస్టేబుల్స్ లావణ్య, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

మహిళా రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేత

లబ్ధిదారులకు రోటవేటర్లు అందజేస్తున్న బోయిని నిర్మలాజయరాజ్

కోహెడ , ఏప్రిల్ 28: మహిళా రైతులకు సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మలాజయరాజ్, వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి ప్రభుత్వం ద్వారా 50 శాతం సబ్సిడీపై మంజూరైన రోటవేటర్లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను గుర్తించి వ్యవసాయ పరికరాలు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సతీశ్, మాజీ సర్పంచ్‌లు శెట్టి సుధాకర్, దొమ్మాట జగన్‌రెడ్డి, నాయకులు బందెల బాలకిషన్, నీలం సురేందర్‌రెడ్డి, పోరెడ్డి సంపత్‌రెడ్డి, గంగం సంతోష్‌రెడ్డి, ఆవుల మహేందర్, గాజుల వెంకటేశ్వర్లు, భీనవేని రాకేశ్, ముంజ శివసాయి, జేరిపోతుల శ్రీను, పిల్లి సత్యనారాయణ, ఈఎవోలు మహిపాల్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకునూరులో బడిబాట

ఆకునూరులో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల, ఏప్రిల్ 28 : మండలంలోని ఆకునూరు జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం బడిబాట నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అర్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, వారి బోధనలో చిన్నారులు ఉత్తమ పొరులుగా ఎదుగుతారని, సర్కారు బడిలోనే మీ పిల్లలను చేర్పించాలని కోరారు.ప్రైవేట్ పాఠశాలకు వెళ్లడం వల్ల తల్లిదండ్రులు ఖర్చుల పాలవుతారని, సర్కారు బడిలో అడ్మిషన్ నుంచి పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, ప్రతి సంవత్సరం విజ్ఞాన విహారయాత్ర తదితర వసతులు ఉచితంగా లభిస్తాయన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీ, సిబ్బంది పాల్గొన్నారు.

మే 1న కథలపుస్తకం ఆవిష్కరణ సభ

కథలపుస్తక ఆవిష్కర సభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కవులు ,రచయితలు

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 28 : సిద్దిపేట శివానుభవ మండపంలో వెన్నల సాహితీ సంగమం వార్షికోత్సవం, మూడుపాయలు కథల పుస్తక ఆవిష్కరణ సభ మే1న సాయంత్రం నిర్వహించడం జరుగుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి యాదగిరి తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సభకు ప్రముఖ కథారచయితలు కాంతారావు , బీవీఎన్‌స్వామి, ప్రముఖ రచయిత మల్లారెడ్డి హాజరవుతారన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం మే 9న పురస్కరించుకొని కవిసమ్మేళనం ఉంటుందన్నారు. రచయితలు, కవులు మల్లారెడ్డి ,తాళ్లయేమరాజు,మోరమోహన్,త్రివిక్రమ శర్మ,ఉమాశంకర్ పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

బెజ్జంకి, ఏప్రిల్ 28: గూడెం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి మాట్లాడారు. మట్టి అక్రమార్కుల టిప్పర్ ఢీకొని కూలీ మృతి చెందడం బాధాకరమన్నారు. అక్రమంగా రాత్రి సమయంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకగా అనుమతి పత్రాన్ని అధికారులు ఇచ్చారని, టిప్పర్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ప్రమాదానికి కారణమని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై పీడీయాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం నాయకుడు రాజేశం, నాయకులు లింగాల లక్ష్మణ్, సంగ రవి, ఐలేని నర్సింహారెడ్డి, బండి రమేశ్, సంగ ఎల్లయ్య, బాబు పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేట, ఏప్రిల్ 28 : నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. యూజీసీ నీట్ పరీక్ష నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా యూజీసీ నీట్ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు పనిచేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), బాలికల ఉన్నత పాఠశాలలోని ర రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మే 4న పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఏమైనా సందేహాలుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 08457 230000ను సంప్రదించాలని కోరారు. అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాదుల దాడి పిరికిపంద చర్య

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 28: పర్యాటకులపై ఉగ్రదాదుల దాడి పిరికిపంద చర్య అని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని సిద్దిపేట ఐదో వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్‌గౌడ్ అన్నారు. కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రవాదులదాడిలో మరణించిన వారిని స్మరిస్తూ స్థానిక శ్రీనగర్‌కాలనీ వాసులతో కలిసి సోమవారం రాత్రి ఆయన కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అల్లం ఎల్లం,బుర్ర చంద్రం ,ఈశ్వర్‌రెడ్డి ,నరేశ్ ,కిషన్ ,రాజశేఖర్,రాజిరెడ్డి ,సిద్ధిరాములు ,కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేట ఐదో వార్డులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనగర్‌కాలనీ వాసులు

నూతన నియామకం

శ్రీనివాస్(ఫైల్)

అక్కన్నపేట, ఏప్రిల్ 28: మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన జెగ్గాని శ